# బళ్ళ నారాయణరెడ్డి

**తేతలి నారాయణరెడ్డిని బళ్ళ నారాయణరెడ్డీ, మేస్త్రి నారాయణరెడ్డీ అని పలకరిస్తారు పసలపూళ్ళో.**

**పొలాల్లో ధాన్యంబస్తాలు ఇళ్ళకీ, రైసుమిల్లులకీ చేర్చాలన్నా, సంతలకి కూరగాయలు తోలాలన్నా ఇల్లు కట్టుకుంటుంటే ఇసకా, ఇటుకా తోలాలన్నా పాత సంతపేటలో ఉన్న తేతలినారాయణరెడ్డి ఇంటికెళ్ళేవారు.**

**తన అయిదుబళ్ళతో పాటు మరో ఇరవై బళ్ళు నారాయణరెడ్డి చేతిలో ఉండేవి. వాటన్నిటికీ అతను మేస్త్రి.**

తన పెద్దాపురం శిల్కుచొక్కాలో వెయ్యి రూపాయలకి తక్కువుండని నారాయణరెడ్డి పెళ్ళాం గవరమ్మకి పావలా బిళ్ళ ఇచ్చేవాడు కాదు. సాయి, చంద్రుడూ, బాలు అని ముగ్గురు మగపిల్లలు అతనికి. పండగొచ్చినా తీర్థమొచ్చినా బేడ డబ్బులు ఇచ్చి ఎరగడు వాళ్లకి. అతనంటే ఇంట్లో అందరికీ భయమే. ఒక్కపెద్ద అక్కగారికి మట్టుకి జడుస్తాడు.

ఈంద్రపేటలో ఉండే కవిటం లింగరాజు బండి నారాయణరెడ్డి బళ్ళలో ఒకటి. నారాయణరెడ్డి ఆదాయం విచ్చలవిడిఖర్చు చూసిన లింగరాజు అతన్తో జట్టు కట్టేడు. ఇంటికి తీసుకెళ్ళి దొడ్లోమేస్తున్న కోళ్ళని కోయించి వండించడం చేగల్నాడులో వాళ్ళ బంధువుకాసే నికార్సయిన సారా తెప్పించి పొయ్యడం లాంటి పన్లు చేస్తూ నారాయణరెడ్డి బాగా మందులో ఉన్నప్పుడు తను ఎక్కడెక్కడ అప్పులు చేసేడో చాకలిపద్దులా చదవడం మొదలెట్టేడు.

లింగరాజు పెళ్లాం పేరు పాప. పుష్టిగా ఎర్రగా ఉండే పాపకాళ్ళకి మువ్వలపట్టాలు పెట్టుకుని ఘల్లు ఘల్లుమంటా నడిచేది. నారాయణరెడ్డి తన భర్తతో కల్సి తాగుతున్నప్పుడు కోక రెడ్డి జబ్బకి తగిలేలాగ రాసుకుంటా వెళ్ళడం తలుపెనకాల్నుంచి అదోలాగ చూడ్డం లాంటివి చేసేది పాప.

ఆవేళ సాయంత్రం వర్షం రావడం లేదుగానీ ఒకటే గాలి.

తొందరగా పనయిపోడంతో లింగరాజు ఇంట్లో కొచ్చిన నారాయణరెడ్డి పిల్చేడు తలుపెనకాలున్న పాప ‘‘పనుండి చింతపిల్లి లాకుల దగ్గర కెళ్ళేడు మీరొస్తే పోసిమ్మని సీసాకాయ ఇచ్చెళ్ళేడు’’ అంది.

లోపలకొచ్చి నులకమంచం వాల్చుకు కూర్చున్న నారాయణరెడ్డికి స్టీలుగ్లాసులోసారా పోసిచ్చి ‘‘ఎండిచేపలు ఏపనా?’’ అంది.

‘‘రెయ్యిలుంటే చూడు’’ అన్నాడు.

వేపి ముందు పెట్టింది.

బాగా రాత్రయిపోయింది. గాలి ఆగడం లేదు.

చలెక్కువగా ఉండటంతో ఆవేళ రోజూకంటే ఎక్కువ పుచ్చుకున్నాడు నారాయణరెడ్డి.


కదలబోతుంటే ‘‘ఇంత పొద్దోయి ఏం వెళ్తారు ఇంటికి... వెచ్చగా ఉంటది మిద్దిగదిలో పడుకోండి’’ అంది.



నారాయణరెడ్డి లోపల కొచ్చేసరికి గళ్ళదుప్పటి పరుస్తుంది పాప. బాగా దగ్గరకొచ్చి జడట్టుకు లాగేడు.

''పిల్లలు అన్నాలు తింటున్నారు'' అనెళ్ళింది.


కాస్సేపయ్యాకా వేడ్నీళ్ళు స్నానం చేసి రాజమండ్రి జాలీ ఫేసుపౌడరు రాసుకుని అటు పక్క తిరిగి మంచం మీద కూర్చునున్న పాపని పడుకోబెట్టి తన పక్కకి తిప్పుకున్నాడు.



* * *

పాపని బాగా మరిగిన తేతలి నారాయణరెడ్డి రోజులో ఏమాత్రం సందు దొరికినా కవిటం లింగరాజు ఇంట్లోనే ఉంటున్నాడు.

పామర్రు అవతల కూళ్ళనించి వచ్చిన ఒక మనిషి "అయిదేళ్లక్రితం లింగరాజు మా దగ్గర బండికొన్నాడు...చాన్నాళ్ళనించి తిప్పుతా వస్తున్నాడు. మొన్నామధ్య వచ్చి గట్టిగా గొడవ చేస్తే మీరిస్తారని చెప్పేడు" అన్నాడు.



"సరే ఎంతివ్వాలో కనుక్కుని రండి రెండుమూడు దఫాలుగా కట్టేస్తాను"అని పంపించేడు.

"నక్లీసు ఆ ఎదవ చేయిస్తాడని ఎన్నాళ్ళనించో చూస్తున్నాను. అదీ జన్మకి అయ్యే పనిగాదని ఎప్పుడో అర్ధమయిపోయింది. వచ్చే పండక్కి చేయించండి రెడ్డిగారూ!" అని గునిసింది పాప.

"సర్లే అలాగే" అన్నాడు.

ద్వారపూడి నించొచ్చిన రామారావు అనే మనిషి దగ్గర మూడేళ్ళక్రితం జత ఎద్దుల్ని కొన్నాడట లింగరాజు. పైకానికి ఇవాళారేపూ అని తిప్పుతున్నాడట.

"నేనం కడ్తాన్లే" అని ఒప్పుకున్నాడం నారాయణరెడ్డి. అలా ఒక పక్కనించి లింగరాజూ ఇంకో పక్కనించి పాప నారాయణరెడ్డి దగ్గర్నించి లాగుతున్నారు.

ఒకరోజు ఇద్దరూబాగా పుచ్చుకుంటున్నప్పుడు "మీరు తక్కువోరు గాదు రెడ్డిగారూ! చాన్నాళ్ళనించి లోపల దొలిచేస్తున్న మాట ఇప్పుడం బయటపెడ్తున్నానం" అన్నాడం లింగరాజు.

"ఏంట్రా అంటన్నావ్?" అన్నాడు నారాయణరెడ్డి.

"నాకు తెల్దనుకోకండి నాపేరు జెప్పి మా ఇంటికొచ్చి మాయావిడితో ఫ్రెండ్షిప్పు పెట్టేసుకున్నారు. నేను మట్టుకి తక్కువ తిన్నోడ్నిగాదండోయ్ మీకోసవన్నట్టు

మీ ఇంటికొచ్చి మీ ఇంటి ఆడోళ్లతో పెట్టుకోనునుకుంటున్నారా... ఇప్పుడదే పన్లో ఉన్నాను. మీరీ పక్కకొస్తే రేపట్నుంచి నేనా పక్కకెళ్తాను'' అన్నాడు.

భార్య గవరమ్మ గుర్తుకొచ్చింది నారాయణరెడ్డికి. పైకిలేచి పెద్ద పెద్ద అడుగులేస్తూ ఇంటికెళ్ళేడు.

మడతమంచం మీద పడుకుని ఉన్న గవరమ్మని లేపి ''ఈ మధ్య ఆలింగరాజు గాడొస్తున్నాడా ఇంటికి?''అన్నాడు.

''నిన్నొచ్చి మిమ్మల్నడిగి వీధిలోంచే వెళ్ళిపోయేడు'' అంది.

''అబద్దాలాడకే నాకన్నీ తెల్సు'' అని ఎడంకాలితో తన్నడం మొదలెట్టేడు గవరమ్మని.

ఇంట్లో అంతా లేచేరుగానీ ఎవరూ మధ్యలోకి రావడం లేదు. దెబ్బలకి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది అరిపేద గవరమ్మ.

అక్కడ్నించి ఎప్పుడు ఇంటికొచ్చినా గవరమ్మని కాలితో తన్నుతానే ఉన్నాడు.

మొగుడికి భయపడిపోయిన గవరమ్మ గాదుల వెనక. మిద్దెలపైన, దూళ్ళసావిట్లోనూ దాక్కుంటుంది. అక్కడికొక్కాడా వెళ్ళి వెతికి వెతికి కొడ్తున్నాడు. నారాయణరెడ్డి పెద్దక్క సుబ్బయమ్మ పిల్చి ''పెళ్ళాన్ని కొడతున్నావట'' అని అడిగితే, 'నేనెప్పుడూ చెయ్యి చేసుకుంది లేదు'' అని అబద్దాలాడి కప్ప దాటేసేడు.

పోను, పోనూ ఇంటికి రావడం బాగా తగ్గించాడు నారాయణరెడ్డి. పెళ్ళాం బిడ్డల్ని మరిచిపోయి పాప ఇంటి చుట్టూరా కుక్కలా తిరుగుతున్నాడు. ఇంట్లో సరుకులు నిండిపోయి పిల్లలు వచ్చి డబ్బులు ఇమ్మంటే ''నా దగ్గరెక్కడియ్యిరా'' అని రెండు కేకలేసేసరికి ఆ తండ్రికి భయపడిపోయి పారిపోయేరా పిల్లలు.

నారాయణరెడ్డి సంపాదనంతా పాప సోకులకి, షికార్లకి సరిపోతుంది. కొన్నాళ్ళు కవిటం లింగరాజు తన మొగుడన్న విషయం మర్చిపోయింది పాప.

కాలం గడుస్తుంది. పిల్లలు పెద్దోళ్లయ్యారు. వాళ్లకు పెళ్ళిళ్ళు అయ్యాయి. కోడళ్ళు వచ్చారు.

అప్పుడప్పుడూ చుట్టం చూపు కొచ్చినట్టొచ్చి నారాయణరెడ్డి గవరమ్మని ఎడం కాలితో తన్నుతుంటే ఎదురుతిరిగిన ముగ్గురు కొడుకులూ జీవితాంతం మా అమ్మను కొడుతుంటే చూస్తూ ఊరుకోం. నీకిష్టం లేకపోతే మా ఇంటికిరావడం మానెయ్యి. ఇంకోసారి కొడ్తే తండ్రన్న విషయం మర్చిపోతాం అని ఎదురుతిరిగేసరికి ఇక మొత్తానికి రావడం మానేసేడు.

మేస్త్రి వీరాస్వామిగారి బంధువు అంగర సూరిబాబు కొత్తగా కొన్న డి. టి. 14 ట్రాక్టర్‌కి మంచి డిమేండు పెరిగింది. దాంతో మాచారం పోతారెడ్డిగారి దగ్గర అప్పు తీసుకుని ఇంకో రెండు ట్రాక్టర్లు కొన్నాడు. వాటికొక్కాడా బోల్డన్ని గిరాకీలు తగుల్తున్నాయి.

సూరిబాబుని చూసి పొట్టిసుబ్బిరెడ్డి గారల్లుడు ఆదిరెడ్డి రెండు ట్రాక్టర్లు కొన్నాడు.

ఇక దాంతో ఊళ్ళో చాలామంది కొనేసేరు ట్రాక్టర్లు. ఎక్కడ చూసినా ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. ట్రాక్టర్లే ట్రాక్టర్లు.

పాత సంతపేటలో తేతలినారాయణరెడ్డి ఇంటిదగ్గర ఎడ్ల బళ్లన్నీ ఆగిపోయున్నాయి. బక్కచిక్కిన ఎద్దులు నీర్సంగా పడుకుని ఒట్టిగడ్డి మేస్తున్నాయి. తన పక్కనున్న మనిషితో ''ఈ ట్రాక్టర్లు రావడంతో మన బళ్ళకి గిరాకీ పడి పోయిందిరా బసివిరెడ్డీ'' అన్నాడు నారాయణరెడ్డి.

''మనం కూడా టాక్టరు కొంటేనో?''అన్నాడు బసివిరెడ్డి.

''ట్రాక్టరు కొనే శక్తి లేదు. అయినా చిన్నప్పట్నుంచి ఈ బళ్ళ మీదున్న మనం, ఆ ట్రాక్టర్లు ఆ ట్రిక్కులూ ఈ వయసులో ఎక్కడ నేర్చుకుంటాం జెప్పు?'' అన్నాడు.

సాయంత్రం లాకుల సైడెళ్తుంటే ఇసక పడవ తాతాలు ఎదురయ్యి ''ఈరోడ్లు పడి ట్రాక్టర్లూ లారీలూ తిరగడం మొదలెట్టాకా మాపడవలోళ్ల బతుకులు దారుణంగా తయారయినియ్యి రెడ్డిగారూ... మాకంటే మీ బళ్ళ పనినయ్యిం రెడ్డిగారూ!'' అన్నాడు.

''ఇప్పుడు మా పనికూడా మీలాగే అయ్యింది తాతాలూ... ట్రాక్టరొచ్చేకా బళ్ళ డిమేండు పడిపోయింది ఈ వయసులో ఏం చెయ్యాలో పాలుపోటం లేదు'' అన్నాడు.

రాత్రి ఇంటికొచ్చి మందు పుచ్చుకుంటున్న నారాయణరెడ్డి ముందు నిలబడ్డ పాప ''రెండొందలడిగేను గదాండీ?'' అంది. ''సొమ్ములు అందలేదు'' అన్నాడు నారాయణరెడ్డి.

''వారం నించి అడుగుతున్నాను'' అంది పాప. ''అందనప్పుడు ఏం జెయ్యను జెప్పు?'' అన్నాడు.

''పేరుకి పెద్ద బళ్ళమేస్త్రి చొక్కా జేబులో తడిమితే ఏగాణీ ఉండదు'' అని విసుక్కుంటా కసుక్కుంటా వెళ్ళిపోయిన పాప దగ్గర తన విలువ పోను పోను పడిపోతుంది.

మంగళవారం లక్ష్మీవారం సంతల్లో మాంసం దుకాణం బెట్టే కళింగసాయిబు చచ్చిపోయేడు. మూలపేటలో అతని ముండ కొడుకు ఆబ్రెహ్మేన్నెవరో చంపేసేరు. కేన్సరొచ్చిన కవిటం లింగరాజు చచ్చిపోయేడు. వయసు పైబడిపోయి, ఆదాయం బాగా తగ్గిపోయిన బళ్ళనారాయణరెడ్డి ఆరోగ్యం బాగా పాడయిపోయింది.

* * *

వేసవికాలం వచ్చేసింది.

లైఫ్‌బోయ్ సబ్బు సగం అరిగేదాకా రుద్దుకుని రెమీటాల్కం పౌడరు డబ్బాలో పౌడరు జల్లుకుని బయటికొచ్చిన పాపుగంటకి కారిపోతా చెమట్లు ఒకటే జిగట. ఆకాశంలో చెంద్రుడున్నాడుగానీ ఊరంతా ఒకటే ఉక్కబోత. తాగేసొచ్చి దొడ్లో పడుకోబోతున్న నారాయణ్రెడ్డి దగ్గర కొచ్చిన పాప ''పిల్లలు పెద్దోళ్ళయ్యేరు. పెళ్ళిళ్ళు చెయ్యాలి. సంబంధాలివ్వడానికొచ్చిన జనం ఊళ్ళోజనం ఈళ్ళనాన్న కేన్సరొచ్చిపోయేడు. ఈళ్ళమ్మని బళ్ళనారాయణ్రెడ్డి వుంచుకున్నాడు అంటున్నారంట. దాంతో ఆళ్ళకి తల తీసేసినట్టవు తుందంట. ఆళ్ళేడుస్తున్నారు. అన్నాలు మానేస్తున్నారు. కనక ఇంక మీ ఇంటికెళ్ళి మీరుండండి. ఇక్కడ నా తిప్పలేవో నేను పడతాను'' అంది.

''అలా కాదు పాపా'' అంటే ''అలాగే కర్తండీ'' అంటా ఆ రాత్రికి రాత్రే తన కొడుకులసాయంతో వాళ్ళింటి ముందు దిగ బెట్టేసింది పాప. ఏం చెయ్యలేని స్థితిలో పెళ్ళాన్ని పిల్లల్ని వెతుక్కుంటూ వచ్చిన నారాయణరెడ్డిని చేరదీసేరు. కొంతకాలానికి నారాయణరెడ్డికి సుగరు పెరగడం వల్ల చూపు తగ్గిపోయింది.

వూళ్లోకి కళ్ల ఆపరేషన్ చేసే డాక్టర్లు వస్తే చేయించుకున్నాడు. అది కుదరక పూర్తిగా కనపడ్డం మానేసినియ్యి కళ్ళు.

ఎడంకాలికి కురుపులేసినియ్యి. సుగర్ మరీ ఎక్కువవడంతో అవి తగ్గక పోయేసరికి రామచంద్రపురం భద్రిరాజు కృష్ణమూర్తిగారి హాస్పిటల్లో కాలు తీసేశారు. నారాయణరెడ్డిని చూసిన వాళ్ళంతా ''పాపం ఆ పెళ్ళాన్ని ఏ ఎడం కాలితో తన్నేవాడు. ఆ ఎడం కాలే తీసేశాడు దేవుడు'' అనేసి పబ్లిగ్గానే చెప్పుకున్నారు.

* * *